
RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...



# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

People Issues Our Mission



Truth Brings A Better Society

CITIZEN TIMES TELUGU DAILY

| సంపుటి :18 | సంచిక : 303 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 8-9- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥ |
|---|---|---|---|---|---|---|
| VOLUME: 18 | ISSUE : 303 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 8-9-2026 | PAGES: 8 | PRICE : 2/- RS |

## లంచాలను ఈఎంఐల్లాగా ఇవ్వాల్సి వచ్చింది

### డీఎంకేపై విజయ్ తీవ్ర విమర్శలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమిళనాడు అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సీఎం విజయ్ విరుచుకుపడ్డారు. బ్యాంకు రుణాలకు ఈఎంఐలు కట్టినట్టుగా వాయిదాల పద్ధతిలో ప్రభుత్వ కాంట్రాక్టర్లు ఆ ప్రభుత్వానికి లంచాలు ఇచ్చుకోవాల్సి వచ్చిందని విమర్శలు గుప్పించారు. దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పొందుపర్చిన వివరాల ఆధారంగా తాను ఈ విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ విలువలో ఆ మొత్తం 10 శాతం వరకు ఉండేదన్నారు. "పార్టీ నిధుల కోసమని చెప్పి, 7.5 శాతం నుంచి 10 శాతం వరకు వసూలుచేశారని ఈడీ పత్రాల ద్వారా వెల్లడవుతోంది. అధికారంలో ఉన్న పార్టీ కోసం ఈ లంచాలు తీసుకున్నారు. అప్పుడు అధికారంలో ఉన్నది డీఎంకేనే కదా..! ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ తదితర కీలక తరువాయి 2లో..

## కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు
- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

తరువాయి 2లో..



## ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి డీపీఆర్, డిజైన్ పనులు ప్రారంభం




### ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీర ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి డిజైన్, డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఐఐటీ-మద్రాస్ నుంచి వచ్చిన ఐదుగురు నిపుణుల బృందం వారం రోజులుగా సముద్ర గర్భం, తీరప్రాంతం వెంబడి సర్వే నిర్వహిస్తోందని చెప్పారు. రక్షణగోడ నిర్మాణానికి తరువాయి 2లో..

## మళ్లీ బద్దలైన అగ్నిపర్వతం..

### 1.7 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇండోనేసియాలోని సుందా జలసంధిలో ఉన్న తరువాయి 2లో..

## అసెంబ్లీలో ఊహించని పరిణామం..

## కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్




**తెలంగాణ, సిటిజన్ టైమ్స్**

- అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి తరువాయి 2లో..


## నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం



**నెల్లూరు, సిటిజన్ టైమ్స్**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని తరువాయి 2లో..



## ఎడిటోరియల్

### రాహులే ప్రధాని అభ్యర్థి...
### కాంగ్రెస్ కి ఏమిటీ కష్టం ?

గాంధీల ఐదో తరం వారసుడికి ఎంత కష్టం వచ్చి పడింది. వరుసగా మూడు ఎన్నికల నుంచి కాంగ్రెస్ వంద మార్క్ ఎంపీలను చేరుకోవడం లేదు. అంతే కాదు రాహుల్ గాంధీ ఎంపీగా మాత్రమే పాతికేళ్ళ రాజకీయ జీవితం మొత్తంలో మిగిలారు. మరో మూడేళ్ల అంటే 2029 లో జరిగే లోక్ సభ ఎన్నికల నాటికి అరవై ఏళ్ళ వయసులో రాహుల్ ఉంటారు. అప్పటికీ ఆయన ప్రధాని అని దేశమంతా అనడానికి ఎన్నికల్లో తీర్పు కావాలి. దాని కంటే ముందు ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థి అని చెప్పడానికి కూడా ఎన్ని అడ్డంకులు మరెన్ని అడ్డు పుల్లలు ఉంటాయో. ఏంటో ఒక్కసారి ఇదంతా చూస్తూంటే కాంగ్రెస్ కి ఎంత కష్టం అని అనిపించక మానదు. రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థిగా ఇండియా కూటమి తరఫున ఉంటారు అని ఒకటికి పదిసార్లు బల్ల గుద్ది మరీ కాంగ్రెస్ పెద్దలు చెప్పుకోవాల్సిన అవసరం ఎందుకు వస్తోంది అన్నదే పెద్ద చర్చ. లేటెస్ట్ గా చూస్తే కాంగ్రెస్ లో అత్యంత కీలక నేత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇండియా కూటమి తరఫున ప్రధాని రాహుల్ గాంధీయే అని గట్టిగా చెప్పాల్సి వచ్చింది. ఆయన ఢిల్లీలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ విధంగా చాలా బలంగా చెప్పాల్సి వచ్చింది. దానికి కారణం తమిళనాడు సీఎం విజయ్ ప్రధాని అభ్యర్థి అంటూ టీవీకే నుంచి విపరీతమైన ప్రచారం సాగడమే. ఇండియా కూటమి తరఫున విజయ్ ని ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నారా అని సూటిగా కేసీ వేణుగోపాల్ నే మీడియా ప్రశ్నించింది. దానికి ఆయన బదులిస్తూ అలాంటిది ఏమీ లేదని ఈ తరహా కథనాలలో నిజాలు లేవని వివరణ ఇచ్చారు. టీవీకే నుంచి అలాంటి డిమాండ్ కూడా లేదని స్పష్టం చేయడమే కాదు ఎవరూ ఇలాంటి గందరగోళ పరిస్థితి సృష్టించవద్దు అని చెప్పారు. ఇండియా కూటమి ముఖ చిత్రంగా రాహుల్ గాంధీ ఉంటారు, ఆయనే నాయకత్వం వహిస్తారు అని చెప్పారు. గందరగోళం సృష్టించవద్దు అని మీడియాను కేసీ వేణుగోపాల్ కోరడం ఓకే కానీ నిజానికి ఈ గందరగోళం అయోమయం ఎక్కడ నుంచి స్టార్ట్ అయింది అన్నది కాంగ్రెస్ పెద్దలకు తెలియదా అని అంటున్నారు. టీవీకే నాయకులు మంత్రులు వీరంతా కదా విజయ్ తదుపరి ప్రధాని అని అంటోంది. మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నది, ఫ్లెక్సీలు కట్టి ప్రచారం చేస్తున్నది అని అంటున్నారు. మరి కాంగ్రెస్ మాత్రం అలాంటిది ఏమీ లేదని రాహుల్ నాయకత్వమే ఇండియా కూటమి కోరుకుంటోంది అని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో చూసుకున్నా ప్రధాని పదవి మీద ఆశ లేని నాయకులు ఎవరైనా ఉన్నారా అంటే లేరనే జవాబు వస్తుంది. ఈ రోజుకి బెంగాల్ లో ఓడి కాస్తా తగ్గినట్లు కనిపించినా 2029 ఎన్నికల్లో ఎక్కువ లోక్ సభ సీట్లు గెలుచుకుంటె కచ్చితంగా మమతా బెనర్జీ ప్రధాని పీఠానికే గురి పెట్టరు అన్న గ్యారంటీ ఏమైనా ఉందా అని అంటున్నారు. అలాగే పంజాబ్ ఢిల్లీ రాష్ట్రాలలో ఆప్ ఎంపీలు ఎక్కువగా గెలిస్తే కేజ్రీవాల్ సైతం ప్రధానిగా రెడీ అంటారని కూడా చెబుతున్నారు. 2027లో యూపీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయితే సమాజ్ వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా 2029 నాటికి ప్రధాని పదవి రేసులో ఇండియా కూటమి తరఫున ఉండరని ఎలా అనుకుంటారు అని అంటున్నారు. ఇలా ఏతా వాతా చూస్తే కనుక రాహుల్ గాంధీకి ముందు ఇండియా కూటమి ఇంటి నుంచే సమస్యలు ఉన్నాయని అంటున్నారు. ఇండియా కూటమి అంతా కూర్చుని మా ప్రధాని అభ్యర్థి రాహుల్ అని ముక్తకంఠంతో చెబితే ఆ మీదట దేశ ప్రజల తీర్పు కోసం వెళ్లొచ్చు అని కూడా ఎన్డీయే నుంచి సెటైర్లు పడుతున్నాయంటే కాంగ్రెస్ భావి నాయకుడికి ప్రధాని పీఠానికి మధ్య దూరమెంత అన్నది అర్థమైపోతోంది కదా అన్నదే అందరి మాట.

# కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి డీపీఆర్, డిజైన్ పనులు ప్రారంభం

అనువైన ఎలైన్‌మెంట్ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేలా డిజైన్ రూపొందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు పవన్‌కల్యాణ్ మాటల్లో.. 'జాతీయ విపత్తు నిర్వహణ నిధి నుంచి కేటాయించిన రూ.323 కోట్లతో రక్షణగోడ నిర్మాణం చేపడతున్నాం. తీరప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవమున్న ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం ప్రస్తుతం క్షేత్రస్థాయి సర్వేలు చేపడుతోంది. అధునాతన డ్రోన్లతో పాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్ 980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే సాంకేతికత వాడుతోంది. తీరప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీరం కోత తీవ్రత, భూభాగ మార్పులు వంటి వాటిపై సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులు గుర్తిస్తోంది. బీచ్ ఆకృతి, వాలు ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. ఇప్పటికే షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. తీరప్రాంత కోత అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలకం. నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులయ్యారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. ఎన్‌డీఎంఏ ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్, గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందులో భాగంగానే డీపీఆర్ రూపకల్పన పనులు మొదలయ్యాయి. పిఠాపురంలో పర్యటించినప్పుడు వీటన్నింటిపై నిపుణులతో చర్చిస్తా. నిర్ణీత గడువులోగా నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డీపీఆర్ రూపకల్పన, పర్యావరణ, ఇతర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి.

# వెలిగొండ కోసం పోరాడిన వ్యక్తి పూల సుబ్బయ్య

**సీపీఐ జాతీయ నేత డాక్టర్ కె నారాయణ**




**మార్కాపురం, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**

కరువు కాటకాలతో సతమతమవుతున్న మార్కాపురం జిల్లా ప్రజలకు వరప్రసాదమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం తుది శ్వాస వరకు ఉద్యమాన్ని కొనసాగించిన సీపీఐ నేత పూల సుబ్బయ్య విగ్రహాన్ని వెలిగొండ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆయన దోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామం వద్ద వున్న ఫీడర్ కెనాల్ ను సందర్శించిన అనంతరం స్థానిక స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ అనేక దశాబ్దాల పోరాటాల ఫలితంగానే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసుకొని కృష్ణా జలాలను వెలిగొండ ప్రాజెక్టులోకి విడుదల కావడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 1984 దశకంలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మార్కాపురం వచ్చిన సందర్భంగా సీపీఐ నాయకత్వంలోని ప్రతినిధి బృందం సభ్యులు పూల సుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి, రావులపల్లి చెంచయ్య తదితర నాయకులు వెలిగొండ ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి, ఈ ప్రాంతంలోని వర్షాభావ పరిస్థితులు, కరువు కాటకాల గురించి ఆయనకు వివరించడం జరిగిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం కావడం శుభపరిణామం అని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సాధనలో ఎవరు అవునన్నా కాదన్నా ఈ క్రెడిట్ అంతా భారత కమ్యూనిస్టు పార్టీకే చెందుతుందని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు సాధనలో సీపీఐ పోరాటాలు, త్యాగాలు మరువలేనివని అన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వలసలు ఉండేవని, వెలిగొండ ప్రాజెక్టు కు నీరు రావడం ద్వారా మార్కాపురం జిల్లాలో భవిష్యత్తులో వ్యవసాయరంగ ఉత్పత్తులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సయ్యద్ యాసిన్, కెవీ కృష్ణగౌడ్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు అందె నాసరయ్య, నియోజకవర్గ సెక్రటరీ ఎస్ కె కాశిం, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కళ్యాణ్, పార్టీ నాయకులు వై రవీంద్రబాబు, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**పుల్లల చెరువు, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**




వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, నియమ నిబంధనలకు లోబడి నిర్వహించాలని మార్కాపురం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పుల్లలచెరువు ఎస్ఐ బి.సాంబశివరావు సూచించారు. సెప్టెంబరు 14 నుంచి జరిగే ఉత్సవాలకు మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో ఉచితంగా అనుమతులు పొందాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతుల కోసం స్త్రుఅవంప్త్రబ్యిజ.అవ్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పరిశీలన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ అవుతుందని, దాన్ని మండపంలో ఉంచాలని తెలిపారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో చేయించాలని సూచించారు. స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించాలని, డీజేలకు అనుమతి లేదన్నారు. రహదారులపై మండపాలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని, బాణసంచా వినియోగించవద్దని తెలిపారు. రాత్రివేళ భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, వీలైన చోట సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు, నిర్ణీత మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ కోరారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజలు, నిర్వాహకులు, యువత, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సాంబశివరావు కోరారు.

## మొదటి పేజీ తరువాయి

### లంచాలను ఈఎంఐల్లాగా ఇవ్వాల్సి వచ్చింది

నేతలు వసూళ్ల సొమ్ముకు ప్రత్యక్ష లబ్ధిదారులు" అని విజయ్ విమర్శించారు.

కరూర్ గ్యాంగ్.. గొప్ప పేరు

కరూర్, కోయంబత్తూర్, ఇతర జిల్లాల్లోని బార్ యజమానుల నుంచి రాజకీయ నాయకులు డబ్బు వసూలు చేయడాన్ని ఈడీ తన నివేదికలో కరూర్ గ్యాంగ్‌గా పేర్కొంది. విజయ్ దానిని ఉటంకిస్తూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై విమర్శలు చేశారు. ఆయన వ్యవస్థీకృత అవినీతి నెట్‌వర్క్‌కు కేంద్రంగా ఉన్నారన్నారు. డీఎంకే ఉన్నచోటల్లా తప్పులు జరుగుతుంటాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కరూర్ గ్యాంగ్ ఈ పేరు ఎంత గొప్పగా ఉంది. దీనికి నాయకుడు ఎవరు..? మనకే ఇంత ఆత్రుతగా ఉంటే.. సామాన్యులకు ఈ విషయంలో ఇంకెంత ఆత్రుత ఉంటుందో ఊహించుకోండి" అని పేర్కొన్నారు.

ఈ అవినీతి ఆరోపణలపై డీఎంకే నేతలు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ పార్టీ నేత ఉదయనిధి స్టాలిన్ ఆరోపణలను తిప్పికొట్టారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన సమస్యలపై మాట్లాడకుండా.. ప్రజల దృష్టి మరల్చేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని దుయ్యబట్టారు.

### మళ్లీ బద్దలైన అగ్నిపర్వతం..

అనక్ క్రాకటా అగ్నిపర్వతం మరోసారి బద్దలయ్యింది. దాని నుంచి భారీ ఎత్తున బూడిద వెలువడుతుండటంతో ఆ సమీప ప్రాంతంలో విమానాల రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది. శుక్రవారం నుంచి క్రియాశీలకంగా ఉన్న ఈ అగ్నిపర్వతం మొదట ఆదివారం తెల్లవారుజామున బద్దలైంది. అర్ధరాత్రి సమయంలో కూడా మరో రెండు సార్లు అందులో పేలుళ్లు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. దట్టమైన పొగ, బూడిద కమ్మేయడంతో దేశవ్యాప్తంగా 8 విమానాశ్రయాలను మూసివేశారు. దీంతో 1.7 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడింది. మరోవైపు, సుందా జలసంధిలో ప్రయాణించే నౌకలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అగ్నిపర్వతం చుట్టూ 3 కిలోమీటర్ల మేర నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. ఆ ప్రాంతంలోకి వెళ్లొద్దని స్థానికులు, పర్యాటకులకు ఆదేశాలు జారీ చేశారు. జకార్తా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. గత రెండు రోజులుగా విమానాలు రద్దవడంతో విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఆదివారం 746 దేశీయ, 272 అంతర్జాతీయ విమానాల సర్వీసులు రద్దయ్యాయి. సోమవారం 8 విమానాశ్రయాల్లో కలిపి మొత్తం 1,500కు పైగా విమాన రాకపోకలను నిలిపివేశారు.

### అసెంబ్లీలో ఊహించని పరిణామం..

సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

### నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

# స్వచ్ఛమైన గాలి - సుస్థిర భవిష్యత్తుకు విద్యార్థులే వారధులు

### 10 వేల విత్తనాల బంతులతో వినూత్న ప్రదర్శన.. 5 వేల కూరగాయల, పూల మొక్కల నాటకం

### ప్రతి విద్యార్థి పర్యావరణ హిత జీవనశైలిని అలవరుచుకోవాలి

### ప్రకృతి ఆధారిత వ్యవసాయం.. సామాజిక వనాల పెంపకంపై డాక్టర్ ఐ. విజయ బాబు పిలుపు





**విశాఖపట్నం, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**

అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి -- నీలి ఆకాశ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సంకల్పించే రోజుగా మార్చుకోవాలని ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయ బాబు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవిస్తూ, ప్రకృతి పరిరక్షణలో భాగస్వామి కావాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి -- నీలి ఆకాశ దినోత్సవం సందర్భంగా సోమవారం విశాఖపట్నంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయ బాబు అధ్యక్షతన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎస్ఆర్‌యూ--జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో తీసుకువచ్చిన 10 వేల విత్తనాల బంతులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 5 వేల దేశీయ వంగ, టమాటా, పచ్చిమిర్చి, బంతి మొక్కల నారును నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంటి పరిసరాల్లోనే సహజ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐ. విజయ బాబు మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 2019లో సెప్టెంబర్ 7ను అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి -- నీలి ఆకాశ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. 2020లో తొలిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారని వివరించారు. "స్వచ్ఛమైన గాలి మన హక్కు.. నీలాకాశం మన భవిష్యత్తు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన కోరారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద కూరగాయలు, ఆకుకూరలు సహజ పద్ధతుల్లో పండించుకోవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా ప్రకృతితో మమేకమైన జీవన విధానం పెంపొందుతుందని పేర్కొన్నారు. అలాగే విత్తనాల బంతులను ఉపయోగించి ఖాళీ ప్రదేశాలు, కొండ ప్రాంతాలు, సామాజిక స్థలాల్లో విస్తృతంగా మొక్కలు పెంచి సామాజిక వనాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం మాట్లాడుతూ, స్వచ్ఛమైన గాలి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడం, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలను ప్రోత్సహించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వాయు కాలుష్యం, వాతావరణ మార్పులు మానవ ఆరోగ్యంతో పాటు ఆర్థిక వ్యవస్థలు, భూమిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి -- ఆరోగ్యకరమైన జీవితం -- సుస్థిరమైన భవిష్యత్తు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి సంవత్సరానికి కనీసం వంద విత్తనాల బంతులను తయారు చేసి సామాజిక వనాల పెంపకానికి తమ వంతు బాధ్యత తీసుకోవాలని కోరారు. వేడెక్కుతున్న శీతోష్ణస్థితిని దృష్టిలో ఉంచుకుని పక్షులకు ఆశ్రయం కల్పించే చెట్లు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, ఇతర జీవరాశులకు ఆహారం అందించే వృక్షాల విత్తనాలను సేకరించి విత్తనాల బంతులుగా తయారు చేయాలని సూచించారు. వాటిని అనువైన ప్రాంతాల్లో విసరడం ద్వారా విస్తృత స్థాయిలో సామాజిక వనాలను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాలు లేదా స్వచ్ఛంద సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు పర్యావరణ ఉద్యమంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు, ఎస్ఆర్‌యూ--జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ. కృష్ణ కుమారి తదితరులు పాల్గొని స్వచ్ఛమైన గాలి, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై మాట్లాడారు.

## డీఎస్సీపై సమాధానం చెప్పే ధైర్యముందా?.. లోకేష్‌కు సవాల్

### 13న విశాఖలో బహిరంగ చర్చకు రావాలని

### తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**

మెగా డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలకు మంత్రి నారా లోకేష్ ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఈ నెల 13న విశాఖలో డీఎస్సీ అంశంపై బహిరంగ చర్చకు రావాలని లోకేష్‌కు సవాల్ విసిరారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. అవసరమైతే సీబీఐ విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించాలని, విచారణ పూర్తయ్యే వరకు నారా లోకేష్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ఎలాంటి అక్రమాలకు సంబంధం లేకుండా మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు అన్యాయం జరగకూడదని, వారికి తెలుగు శక్తి పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. డీఎస్సీ అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనం వీడి స్పందించాలని బి.వి.రామ్ కోరారు. డీఎస్సీపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని, నిజానిజాలు వెలుగులోకి వచ్చే వరకు తెలుగు శక్తి పోరాటం కొనసాగుతుందని బి.వి.రామ్ స్పష్టం చేశారు.

## స్కౌట్స్ శిక్షణతో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి

### యారాడ జెడ్పీ హైస్కూల్‌లో

### స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ప్రత్యేక నైపుణ్య శిక్షణ



**విశాఖపట్నం , సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్):**

యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్ హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా భావం పెంపొందుతాయని తెలిపారు. శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు సమాజ సేవ పట్ల అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. అప్పారావు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనలను పెంపొందిస్తుందని అన్నారు. ఈ శిక్షణ పొందిన వారికి ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాల్లోనూ ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ చైర్‌పర్సన్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ డాక్టర్ మారుతి హరీష్ కుమార్, జిల్లా రోవర్స్ కమిషనర్ సీహెచ్. చిత్తరంజన్ దేశాయ్, స్కౌట్స్ మాస్టర్ డి. సత్యకుమార్, శ్రీ సాయి వెంకటేశ్వర స్కూల్, కాకరలోవ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు.

## విశాఖ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 30:**

విశాఖ జిల్లా ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఎస్. మల్లేశ్వరరావు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ అమరావతి జేఏసీ విశాఖ జిల్లా వైస్ చైర్మన్ ఈగల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సంఘ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. నూతన కార్యవర్గంలో ఎన్. లోకేశ్వరరావు (రెవెన్యూ శాఖ) – చైర్మన్, రావాడ సత్తిబాబు (వైద్య ఆరోగ్య శాఖ) – కన్వీనర్, ఇమంది వరప్రసాద్ – కోశాధికారి, ఉప్పిలి చిన్నారావు (పశుసంవర్ధక శాఖ) – సభ్యుడు, బండి వేలంగిని రావు (కేజీహెచ్) – సభ్యుడిగా నియమితులయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎం. విశ్వేశ్వర నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, సంఘ కార్యకలాపాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈగల శ్రీనివాసరావుతో పాటు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసాతో ఆనందపురంలో కొత్త ఆశలు

### పెన్షన్ దరఖాస్తులతో కిక్కిరిసిన గ్రామ సచివాలయం

### పెన్షన్ దారులకు అండగా జై జవాన్ ఫౌండేషన్ సేవలు



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 07**



ఆనందపురం గ్రామపంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో గ్రామ సచివాలయంలో సందడి వాతావరణం నెలకొంది. కొత్తగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు సచివాలయానికి తరలిరావడంతో ప్రాంగణం పెన్షన్ అర్హులతో కిక్కిరిసిపోయింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే ప్రధాన లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆనందపురం గ్రామపంచాయతీ కూటమి నాయకులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జై జవాన్ ఫౌండేషన్ టీం సభ్యులు సచివాలయానికి వచ్చిన పెన్షన్ దారులకు విశేష సహాయ సహకారాలు అందించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అప్లికేషన్ ఫారాలను ఎలా నింపాలి, అవసరమైన ధ్రువపత్రాలు ఏమిటి, తీసుకువచ్చిన జిరాక్స్ కాపీల్లో ఏమైనా లోపాలున్నాయా వంటి అంశాలను పరిశీలించి తగిన సూచనలు అందించారు. దరఖాస్తులు నింపడంలో కూడా ఫౌండేషన్ సభ్యులు స్వయంగా సహాయం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. పెన్షన్ కోసం వచ్చిన ప్రతి ఒక్కరికీ అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తుల ప్రక్రియలో మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో వి. సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి జి. శ్రీరామ్ మూర్తి (బాబి), పంచాయతీ కార్యదర్శి దేవభక్తుని రఘునందన్ బాబు, ఆనందపురం గ్రామపంచాయతీ కూటమి నాయకులు, ఎంపీటీసీ కొట్టాడ రమాదేవి, జనసేన పార్టీ భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ముడసల శ్రీను, యూత్ ప్రెసిడెంట్ లంక నర్సింగరావు (జానీ), బంటుపల్లి బంగారు రాజు, స్టేట్ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అంగటి రాము, డిజిటల్ అసిస్టెంట్ చందక వెంకట్రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మెట్ట జ్యోతి, మహిళా పోలీస్ భోగి రోతు రామలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ మనోహర్, సర్వేయర్ సోము ప్రసాద్, వీఆర్వో కోడూరు అప్పారావు, జై జవాన్ ఫౌండేషన్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

### గాజువాక జోన్ పిజిఆర్ఎస్ లో 41 అర్జీలు

### స్వీకరించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్):**

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన్రా+=ా కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని ప్రజల నుంచి 41 అర్జీలను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు అధికంగా ఫిర్యాదులు అందాయని పేర్కొంటూ, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే ఫిర్యాదు చేసే పరిస్థితి రాకూడదన్నారు. అనంతరం వివిధ విభాగాల పనితీరుపై సమీక్ష నిర్వహించిన కమిషనర్, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డుల్లో నిరంతర పర్యవేక్షణ ద్వారా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను ప్రారంభ దశలోనే అరికట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి, పర్యవేక్షక ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, అటెండర్లకు కమిషనర్ యూనిఫాంలను అందజేశారు.

## సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన టిడిపి నాయకులు



**అంబాజీపేట సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

పి. గన్నవరం నియోజకవర్గం, అంబాజీపేట మండలం, ఇరుసుమండ గ్రామం లో 09 వ తేదీ బుధవారం జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కోనసీమ జిల్లాలో పర్యటన సందర్భంగా హెలీప్యాడ్, మాచవరం గ్రామం, కొత్తపాలెం లో రైతుల పాస్ బుక్ ల పంపిణి, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమ సభా ప్రాంగణాన్ని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తో కలిసి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పరిశీలించారు... ఈ కార్యక్రమం లో జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అంబాజీపేట టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, నాగారపు సుబ్బారావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, మహిపాల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## గుంతలకు 'పాట్‌హోల్ డాక్టర్' చికిత్స

### రూ.1.30 కోట్ల అత్యాధునిక యంత్రంతో రహదారి మరమ్మతులకు వేగం

### రోజుకు 300 చ.మీ. ప్యాచ్‌వర్క్ సామర్థ్యం.. యంత్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**

నగర రహదారులపై ఏర్పడుతున్న గుంతలకు వేగంగా, నాణ్యమైన మరమ్మతులు చేపట్టేందుకు జీవీఎంసీ అత్యాధునిక 'బీటీ పాట్‌హోల్ డాక్టర్' యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సుమారు రూ.1.30 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ యంత్రాన్ని సోమవారం సౌత్ జోన్ పరిధిలోని కేర్ హాస్పిటల్ సమీపంలో జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్, కమిషనర్ కేతన్ గార్గ్ ప్రారంభించి పనితీరును పరిశీలించారు. యంత్రం ద్వారా రహదారిపై గుంతలను శుభ్రపరచడం, బిటుమెన్ మిశ్రమాన్ని నింపడం, పటిష్టంగా ప్యాచ్‌వర్క్ పూర్తి చేయడం వంటి ప్రక్రియలను అధికారులు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. రోజుకు సుమారు 300 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్యాచ్‌వర్క్ చేపట్టే సామర్థ్యం ఈ యంత్రానికి ఉందని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గుంత పరిమాణాన్ని బట్టి ఒక్కో మరమ్మతును సుమారు 10 నుంచి 15 నిమిషాల్లో పూర్తి చేసే అవకాశం ఉందని, నగరంలోని అన్ని జోన్లలో అవసరానికి అనుగుణంగా ఈ యంత్రాన్ని వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారులు, అధిక వాహన రాకపోకలు ఉన్న ప్రాంతాలు, అత్యవసర మరమ్మతులు అవసరమైన మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. యంత్రాన్ని సరఫరా చేసిన సంస్థే మూడు సంవత్సరాల పాటు ఆపరేషన్, నిర్వహణ బాధ్యతలను చేపడుతుందని వివరించారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారులను గుర్తించి తక్షణ మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతపై క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో రహదారి మరమ్మతులను వేగవంతం చేసి, దశలవారీగా నగరంలోని ప్రధాన మార్గాలను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మెకానికల్ విభాగం పర్యవేక్షక ఇంజనీర్ రాయల్ బాబు, ఇంజనీరింగ్ అధికారులు, సౌత్ జోన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ గాలి కోసం విశాఖలో భారీ జనచైతన్య ర్యాలీ

## స్వచ్ఛ వాయు దివస్- 2026 సందర్భంగా బీచ్ రోడ్డుపై పర్యావరణ పరిరక్షణ సందేశం

## ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రముఖులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యం





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 7:**

స్వచ్ఛమైన గాలి ప్రతి జీవి ఆరోగ్యానికి అత్యంత అవసరమని, వాయు కాలుష్య నియంత్రణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిస్తూ స్వచ్ఛ వాయు దివస్--2026 సందర్భంగా విశాఖపట్నం బీచ్ రోడ్డులో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం నింపింది. వైజాగ్ బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ప్రారంభమైన ఈ అవగాహన ర్యాలీ గోకుల్ పార్క్ వరకు కొనసాగింది. ర్యాలీలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్, వైజాగ్ పోర్ట్ చైర్మన్, డిప్యూటీ చైర్‌పర్సన్, జీవీఎంసీ కమిషనర్‌తో పాటు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డైరెక్టర్ పంచకర్ల సందీప్, పర్యావరణవేత్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డైరెక్టర్ పంచకర్ల సందీప్ మాట్లాడుతూ, స్వచ్ఛమైన గాలి ప్రతి మనిషి ప్రాథమిక అవసరమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. వాయు కాలుష్యం పెరగకుండా నియంత్రించడంలో ప్రభుత్వ చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్నచిన్న మార్పులతోనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని, అవసరం లేని వాహన వినియోగాన్ని తగ్గించాలని, కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించాలని పిలుపునిచ్చారు. నేటి తరం పర్యావరణ పరిరక్షణపై చూపించే బాధ్యతే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అవుతుందని పంచకర్ల సందీప్ పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారు పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నియంత్రణకు సంబంధించిన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. పెరుగుతున్న వాహనాల వినియోగం, పారిశ్రామిక కార్యకలాపాలు, ఇతర కాలుష్య కారకాల కారణంగా వాతావరణంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విశాఖ నగరం పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని, పచ్చదనం పెంపు మరియు కాలుష్య నియంత్రణకు ప్రజలు, ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేయాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో ప్రజలు, అధికారులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్న ఈ ర్యాలీ విశాఖ బీచ్ రోడ్డులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "స్వచ్ఛమైన గాలి.. ఆరోగ్యకరమైన జీవితం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ విజయవంతంగా ముగిసింది.

## జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగ శ్రీనివాస్ కు పలువురు పరామర్శ






**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

మాతృ వియోగం తో బాధపడుతున్న జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పెంట నాగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సోమవారం పలువురు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం, కొండుకుదురు గ్రామానికి చెందిన నాగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కొండుకుదురు లంకలో తన స్వగృహం వద్ద పరామర్శించి నాగ శ్రీనివాసు మాతృమూర్తి ధనలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో అయినవిల్లి మాజీ జడ్పిటిసి సభ్యులు,జిఎంసి బాలయోగి చార్టు ట్రస్ట్ చైర్మన్ గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ శ్రీనివాస్, కొండు కుదురు- పోతుకుర్రు ఎంపీటీసీ సభ్యులు గుర్రాల రమాదేవి రాంబాబు, వీరవల్లి పాలెం మాజీ సర్పంచ్ సలాది బుచ్చిరాజు, కొండకుదురు మాజీ సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్, జనసేన నాయకులు పడాలగిరి ,తోలేటి ఉమా, పలువురు రెవెన్యూ అధికారులు,బంధుమిత్రులు, గ్రామస్తులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఢిల్లీలో మంత్రి చర్చలు

**అమరావతి: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్; 07**

ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువులు సరఫరా, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉంచడంపై చర్చించారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.



## కొత్త పింఛన్లపై ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన

## సెప్టెంబర్ 7 నుంచి దరఖాస్తుల స్వీకరణ..

### పంచాయతీ కార్యదర్శులకు మార్గదర్శకాలపై వివరణ



**గుర్రంకొండ, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, మంజూరు ప్రక్రియపై గుర్రంకొండ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర వర్గాల నుంచి కొత్త పింఛన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ, ప్రాథమిక అర్హత పరిశీలన చేపడతారని వివరించారు. దరఖాస్తుల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత అధికారుల ధ్రువీకరణ, ఎంపీడీఓ సిఫార్సు, రాష్ట్రస్థాయి పరిశీలన అనంతరం ప్రభుత్వ ఆమోదంతో పింఛన్లు మంజూరు కానున్నాయని తెలిపారు. అర్హులైన వారు ఆధార్, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆయా వర్గాలకు సంబంధించిన ప్రత్యేక ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సూచించారు.

## 12వ వార్డులో నెలకొన్న సమస్యలు

## పరిష్కరించాలి కౌన్సిలర్,ముమ్మడి విజయలక్ష్మి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 7**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో పారిశుధ్యం, వీధి దీపాల సమస్యతో పాటు అడవిని తలపించే విధంగా సర్కార్ తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాడుబడిన ఇళ్లు కూలిపోయి, కంప చెట్లు మొలిచి పాములకు ఆవాసంగా మారింది. తత్వ రోడ్డు అధ్వానంగా మారి ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను. మురుగునీరు రోడ్ల మధ్యలో పారుతుండటంతో, పిచ్చి మొక్కలతో రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. చెత్త ఎత్తడానికి కూడా మున్సిపల్ సిబ్బందిని అధికారులు 12వ వార్డుకు పంపడం లేదు. నేను కౌన్సిలర్ గా ఎన్నికైన నాటి నుంచి సమస్యలను మున్సిపల్ కమిషనర్ గారి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మౌలిక వసతులను కల్పించడం గురించి కలిసి ప్రస్తావిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కౌన్సిలర్ గా ప్రజల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదు. కావున 12వ వార్డు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడానికి అధికారులను పంపించి సమస్యల తీవ్రతను గుర్తించి పనులు చేపట్టాలని మీ ద్వారా కోరుతున్నాను. సమస్యను పరిష్కరించని ఎడల వార్డు ప్రజలతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని వార్డు ప్రజలు, కౌన్సిలర్ గా నేను ఒక నిర్ణయానికి వచ్చాము. కావున సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నాము.

## ఉత్తరాంధ్ర వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్ ను పరామర్శించిన వైఎస్ఆర్సిపి శ్రేణులు

**కాకినాడ సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

కాకినాడలో ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా పలువురు వైఎస్ఆర్సిపి శ్రేణులు పరామర్శించారు. కార్యక్రమంలో పాల్గొని, వారి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన విందు కార్యక్రమంలో మాజీ మంత్రి, పిఏసి సభ్యులు, అమలాపురం పార్లిమెంట్ ఇంచార్జ్ పినిపే విశ్వరూప్, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, అమలాపురం అసెంబ్లీ ఇంచార్జ్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా,మాజీ మంత్రి తోట నరసింహం,పెద్దాపురం కోఆర్డినేటర్ దవుళ్లూరి దొరబాబు,మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.



## గుబ్బడి ముదిరాజ్ కులస్తుల ధర్నా



**సిటిజన్ టైమ్స్ , హుస్నాబాద్, సెప్టెంబర్ 7**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట అక్కన్నపేట మండలం గుబ్బడి గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు ధర్నా చేపట్టారు. గుబ్బడి గ్రామంలో కబ్జాకు గురైన ముదిరాజ్ సంఘానికి చెందిన రెండు ఎకరాల భూమి తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కబ్జాకు పాల్పడ్డ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు మెడబోయిన రాజయ్య పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చెయ్యాలని ఆర్డీవో కు వినతి పత్రం అందజేశారు. గతంలో కుల సంఘం ఆధ్వర్యంలో కొన్న భూమిని 2014 లో కుల సంఘం అధ్యక్షుడిగా అయిన మాజీ అధ్యక్షుడు మెడబోయిన రాజయ్య అక్రమంగా పట్టా చేయించుకున్నారని ముదిరాజ్ సంఘం నాయకులు వాపోయారు. ఇదేమిటని అడిగితే తమపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తలా కొంత డబ్బులు వేసుకొని కుల సంఘానికి అని భూమి కొనుక్కున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా పట్టా చేయించుకున్న భూమిని తిరిగి తమ కుల సంఘానికి అప్పగించాలని అధికారులను కోరినట్లు వెల్లడించారు.

## హాలిడే వైపు రైతుల చూపు



**అమరావతి; (సిటిజన్ టైమ్స్); సెప్టెంబర్; 07**

రాష్ట్రంలో క్రాప్ హాలిడే వైపు చూస్తున్న ఆక్వా రైతులు. ఐదు నెలల్లో టన్ను ఆక్వా ఫీడ్ పై అదనంగా రూ 26 వేల వరకు పెరిగిందని రైతులు వాపోతున్నారు. దీంతో కిలో వ్యానామి రొయ్యల ఉత్పత్తికి రూ 300, టైగర్ రొయ్యలకైతే 450 ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెట్టుబడి పెరిగిన రొయ్యల ధరలు పెరగటం లేదని, ఫీడ్ ధరల తగ్గింపు తమ డిమాండ్లు పరిష్కారం కాకపోతే క్రాఫ్ హాలిడే ప్రకటిస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఒక టన్ను ఫీడ్ సగటు ధర రూ 90 వేల నుంచి రూ లక్ష 12 వేల వరకు ఉంటుందనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బండారులంకలో కొత్త జడ్పీకి బాటలు

### 2.37 ఎకరాల సొంత స్థలంలో కోనసీమ జిల్లా పరిషత్ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు



**అంబాజీపేట, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్):**

జిల్లా ప్రజా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 24తో ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ పదవీకాలం ముగియనుండగా, 25 నుంచి నూతన జడ్పీ ఆవిర్భవించనుంది. 19 గ్రామీణ మండలాలు కోనసీమ జడ్పీ పరిధిలోకి రానున్నాయి. అమలాపురానికి సమీపంలోని బండారులంకలో జడ్పీకి చెందిన 2.37 ఎకరాల సొంత స్థలం ఉండటంతో అక్కడే శాశ్వత కార్యాలయ నిర్మాణానికి అవకాశం ఉన్నట్లు సమాచారం. తొలుత అమలాపురంలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. సుమారు ఆరు దశాబ్దాల క్రితం జడ్పీకి అందించిన ఈ స్థలం ప్రస్తుతం కొబ్బరి తోటలతో ఉంది. భవన నిర్మాణాలు, పార్కింగ్‌కు అనువైనప్పటికీ వరదల సమయంలో ముంపునకు గురవుతుండటంతో మెరక పనులు, రహదారి అభివృద్ధి అవసరమని తెలుస్తోంది. నూతన జడ్పీ ఏర్పాటుతో 19 మండలాల గ్రామీణాభివృద్ధి, తాగునీరు, రహదారులు తదితర సమస్యలపై మరింత వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## చింతమని చెరువు నాటికి నేటికి అభివృద్ధి

**సిటిజన్ టైమ్స్,ధర్మపురి, సెప్టెంబర్ 07**

ధర్మపురి పరిసర ప్రాంతమ్ లో చింతమని చెరువు మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందినది అని చెప్పవచు. గతం లో చెత్త చెదరం. మలినం మురికి నీరు ఉండేది.నేడు చుట్టు రాళ్లతో నిర్మితమైన.పర్పిట్ గోడ.చుట్టు పక్కల విశాలం అయింటువంటి .వాకింగ్ చేయడానికి స్థలం.చుట్టు పక్కల పచ్చని చెట్లు. పూల చెట్లు. అట స్థలం .చూడడానికి బాగుంది అని చెప్పవచ్చు. ప్రొద్దున సమయానికి వాకింగ్ కి, సాయంత్రంలోగా విశ్రాంతి కి.కూర్చోవడానికి కుర్చీలు. పిల్లలు పెద్దలు యిక్కడకి వస్తారు.యివిధం అయినటువంటి ప్రశాంత స్థలం గా రూపు ధిద్దబడింది.



# ప్రభుత్వ ఉద్యోగి నా.. ఇన్స్యూరెన్స్ ఏజెంటా?

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 08:**
విధులను గాలికి వదిలేసి విదేశీ పర్యటనలు చేస్తున్నారంటూ ఆరోపణలు అధికారుల అండదండలతోనే ఇదంతా జరుగుతోందని విమర్శలు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించాల్సిన ఓ ఉద్యోగి తరచూ పర్యటనలు చేస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. విధులకు హాజరుకాకుండా విదేశీ పర్యటనలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారంటూ పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో సదరు ఉద్యోగి విదేశీ పర్యటనలో ఉన్నట్లు కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల్లో స్నేహితులతో కలిసి పర్యటిస్తూ, హోటళ్లు, పర్యాటక ప్రాంతాల్లో ఫొటోలు దిగిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో "ప్రభుత్వ ఉద్యోగమా... లేక ఇన్స్యూరెన్స్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**విధులకు గుడ్‌బై.. విదేశీ టూర్లకు హాయ్?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగి సెలవులు, అనుమతులు తీసుకున్నారా? విదేశీ పర్యటనకు సంబంధిత శాఖ నుంచి అనుమతి ఉందా? పర్యటన సమయంలో విధులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అయితే ఈ వ్యవహారంపై డీఈఓ, ఎంఈఓ స్థాయి అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని, వారి సహకారం




ఉండటం వల్లే సదరు ఉద్యోగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఉన్నతాధికారులు విచారణ జరపాలి**

ప్రభుత్వ ఉద్యోగి విధులకు గైర్హాజరవుతున్నారా? విదేశీ పర్యటనలకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? విధులకు హాజరు కాకపోయినా వేతనం పొందుతున్నారా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విధుల విషయంలో నిబంధనలు అందరికీ ఒకేలా వర్తిస్తాయా? లేక అధికారుల అండ ఉంటే నిబంధనలు పక్కన పెట్టొచ్చా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



## పార్టీ జెండా, ఎజెండాను ప్రకటిస్తా



**విజయవాడ (సిటిజన్ టైమ్స్) సెప్టెంబర్ 07**
రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు కానున్నట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దసరాకు తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటిస్తానని తెలిపారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపిని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం ఏపీలో టిడిపి రెడ్బుక్ పాలన కొనసాగిస్తుండగా, ప్రతిపక్ష పార్టీ వైసిపి రప్ప రప్పపార్టీలు నడిపిస్తున్నారని ఆరోపించారు.

## ఆలయంలో చోరి



**ముత్యాల:(సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్; 07**
ఎన్టీఆర్ జిల్లా,జగ్గయ్యపేట మండలం, ముత్యాల గ్రామంలోని ప్రసిద్ధ చెన్నకేశవ స్వామి దేవాలయంలో దొంగతనం జరిగింది. దుండగులు ఆలయంలోని సీసీ కెమెరాలు వైరల్ కట్ చేసి లోపలికి ప్రవేశించి, విలువైన వస్తువులు, నగదులను అపహరించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు . జగ్గయ్యపేట సిఐ, వెంకటేశ్వర్లు, ఎస్సై రాజు బృందంతో ఎంతదొంగతనం జరిగింది అనేది పూర్తి సమాచారం సేకరిస్తున్నారు.

## ఐటీ రంగంలో 20 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు..**

**నెలకు రూ.35,570 వరకు వేతనం**



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**
స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ ఐటీఐలు కాకినాడ, రాజమహేంద్రవరం, భీమ వరం, ఏలూరు, విజయవాడలో ఇండియా ఏఐ డేటా, ఏఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రాంతీయ ఉపసంచాలకులు (అప్రెంటిస్) బి. మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో కాంట్రాక్టు పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

డేటా యానోటేటర్ అసిస్టెంట్ -- 5 పోస్టులు

డేటా క్యురేటర్ అసిస్టెంట్ -- 5 పోస్టులు

కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ (కంప్యూటర్) -- 10 పోస్టులు డేటా యానోటేటర్ అసిస్టెంట్, డేటా క్యురేటర్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.35,570, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.22,805 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 25లోగా దరఖాస్తులు ఉద్యోగ అర్హతలు, ఇతర వివరాలు, దరఖాస్తు నమూనాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

## బాధితుల సమస్యలకు సత్వర న్యాయం

**జిల్లా ఎస్.పి.రాహుల్ మీనా**

**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**
అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో (సోమవారం) జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడింది. జిల్లా ఎస్.పి.రాహుల్ మీనా, జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే తో కలిసి స్వయంగా బాధితుల నుండి సుమారు 30 అర్జీలను స్వీకరించారు.లి ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి.తో పాటు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, డి.పి.ఓ., ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 11న ఆగిరిపల్లికి మందకృష్ణ మాదిగ రాక

### బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ




**ఏలూరు జిల్లా/ ముసునూరు:(సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్; 07**
ఎస్సీ వర్గీకరణ ఉద్యమ విజయ సారథి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సెప్టెంబర్ 11న ఆగిరిపల్లి మండలంలోని కనసానపల్లి, నెక్కలం గొల్లగూడెం గ్రామాలకు విచ్చేయనున్నారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం చింతలపల్లి గ్రామంలో ముసునూరు మండల ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ కమిటీ నాయకులు విడుదల చేశారు. సమావేశానికి నూజివీడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దుబ్బాకు దేవరాజు మాదిగ, ముసునూరు మండల కో-ఇన్‌చార్జ్ కలపాల విలియమ్స్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సెప్టెంబర్ 11న నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముసునూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మద్దాల బాబురావు మాదిగ, ముసునూరు ఎంఎస్పీ అధ్యక్షులు దువ్వూరి లక్ష్మణరావు మాదిగ, గండిపూడి బాబురావు మాదిగ, ముళ్లపూడి సంజయ్ మాదిగ, మద్దాల మురళి మాదిగ, పల్లిపాము వెంకటేశ్వరరావు మాదిగ, కుమ్మకూరి రాంబాబు మాదిగ, గొల్లపల్లి ప్రసన్నకుమార్ మాదిగ, పల్లిపాము చిట్టిబాబు మాదిగ, గొడవర్తి రవి మాదిగ, తేనేటి రమేష్, సోదిమెళ్ల సాయి చందు మాదిగ, కట్టే దేవదర్శనం మాదిగ, కంకట వెంకటరత్నం మాదిగ, పల్లిపాము రవీంద్ర మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## 9న కోనసీమ జిల్లాకు సీఎం చంద్రబాబు

### అంబాజీపేటలో రైతులతో ముఖాముఖి.. గ్రామసభ, కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్న సీఎం

**అమలాపురం, సెప్టెంబర్ 7 (సిటిజన్ టైమ్స్)**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. అంబాజీపేట మండలంలో పలు అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు సీఎం కార్యాలయం పర్యటన షెడ్యూల్ విడుదల చేసింది. ఉదయం 10.30 గంటలకు ఇరుసుమండ లేఅవుట్ హెలిప్యాడ్‌కు చేరుకోనున్న సీఎం, అనంతరం మాచవరం జయంతినగర్‌లో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. పండువారిపేటలో గ్రామసభలో పాల్గొని, స్టాళ్లను సందర్శించి రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం బుడుంగపేటలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం సాయంత్రం 4.55 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.



## సిటిజన్ టైమ్స్ దినపత్రిక తెలంగాణ స్టేట్ బ్యూరోగా బోడా శ్రీను నియామకం

### జర్నలిస్టులు, గిరిజన నాయకుల అభినందనలు





**మహబూబాబాద్, సిటిజన్ టైమ్స్,సెప్టెంబర్ 7**
సిటిజన్ టైమ్స్ దినపత్రిక తెలంగాణ స్టేట్ బ్యూరోగా మహబూబాబాద్ వాస్తవ్యులు, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా నాయకులు బోడా శ్రీను నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు జర్నలిస్టులు, గిరిజన నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిజం న్యూస్ తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్యూరో, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్, గిరిజన నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరిచంద్ర, తండా సర్పంచ్ బోడా సుమిత్ర వీరన్న నాయక్, వీరన్న సుమన్ నాయక్ తదితరులు బోడా శ్రీనును శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిజం రంగంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తన కలంతో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. బోడా శ్రీను భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, సిటిజన్ టైమ్స్ దినపత్రిక ద్వారా ప్రజా సమస్యలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## ఆటోలో బంగారం, నగదుతో మర్చిపోయిన బ్యాగ్

### ఆటో డ్రైవర్ నిజాయితీకి ప్రశంసలు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**
ఆటోలో మరిచిపోయిన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్‌ను అమలాపురం పట్టణ పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించి బాధితులకు అందజేశారు. ఈరోజు సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో మానే సత్యనారాయణ,ఆదిలక్ష్మి దంపతులు మహిపాల్ చెరువు నుండి అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ఆటోలో వచ్చారు. గమ్యస్థానానికి చేరుకున్నాక ఆతురుతలో తమ వద్ద ఉన్న బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయి దిగారు. కాసేపటికి బ్యాగ్ లేని విషయాన్ని గమనించేసరికే ఆటో అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన బాధితులు వెంటనే అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి సిఐ పి. వీరబాబు కు ఫిర్యాదు చేశారు రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం (సీసీటీవీ ఫుటేజ్, నిఘా వ్యవస్థ) ఆధారంగా స్వల్ప వ్యవధిలోనే సదరు ఆటోను గుర్తించారు. సమాచారం అందుకున్న ఆటో డ్రైవర్ గుత్తుల శ్రీనివాసరావు ఏమాత్రం దురాశ పడకుండా నిజాయితీగా ఆ బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆ బ్యాగ్‌ను పరిశీలించి, అందులోని 10 గ్రాముల బంగారం, రూ.5,000/- నగదును బాధితుల సమక్షంలో సరిచూసి వారికి అందజేశారు. పోగొట్టుకున్న విలువైన వస్తువులు వెంటనే దక్కడంతో బాధిత దంపతులు పోలీసులకు, ఆటో డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ గుత్తుల శ్రీనివాసరావును పట్టణ ఎస్ ఐ కిషోర్ బాబు,పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు.

## నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే దేవా



**రాజోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**
అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలంలో రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందజేశారు. లక్కవరం ఏం జి గార్డెన్స్‌లో లక్కవరం, బట్టేలంక, ఇరుసుమండ గ్రామాలకు చెందిన రైతులకు రీ-సర్వేలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ద్వారా భూ రికార్డులను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించి రైతులకు స్పష్టమైన భూ హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రైతుల భూ యాజమాన్యానికి ముఖ్యమైన ధ్రువపత్రాలుగా ఉపయోగపడతాయని, భూ వివాదాలను తగ్గించడంతో పాటు, రైతులు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలను సులభంగా పొందేందుకు ఇవి ఉపయోగపడతాయని, రైతులకు ఎటువంటి భూ సమస్యలు ఉన్నా అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అక్రమన పేరుతో దౌర్జన్యంగా పశువుల పాకను కూల్చిన డిప్యూటీ తాసిల్దార్

## బినామీ పేర్లతో ఇంటి పట్టాలు, ప్రభుత్వ స్థలాలను అమ్ముకుంటున్న మాజీ డీలర్





**బద్వేలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

గోపవరం మండలం లోని మునక ప్రాంతానికి చెందిన సూరి పల్లె గ్రామస్తులకు గోపవరానికి సమీపంలో బీసీ కాలనీ సర్వేనెంబర్ 234 లో ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగింది అక్కడ నివాసం ఏర్పరచుకొని జీవిస్తున్న తురక వెంకటసుబ్బయ్య అను వ్యక్తి తన నివాస గృహం సమీపంలో ప్రభుత్వ ఖాళీ స్థలం లో గత ఎనిమిది సంవత్సరాల నుండి పశువుల పాకను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యక్తిపై గోపవరం రెవిన్యూ అధికారులకు కొంతమంది లేనిపోని తప్పుడు ఫిర్యాదు చేయడంతో వారు ఏర్పాటు చేసుకున్న పశువులపాకను గోపవరం డిప్యూటీ తహసిల్దార్ జెసిబి తో కొంత భాగం కూ ల్చడం జరిగిందని ప్రజా ఫిర్యాదుల వేదికలో సోమవారం రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ కు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేయడం జరిగింది అదే కాలనీలో సుమారు 20 ప్లాట్ లను మాజీ డీలర్ సుబ్బరాయుడు బినామీ పేర్లతో పట్టాలు పొంది వాటిని ఇతరులకు అమ్మడం జరిగిందని ఆయన తన ఫిర్యాదులో తెలిపారు. ఈ విషయంలో గోపవరం డిటి నాపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకొని సుబ్బరాయుడు తో కలిసి నన్ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు, అక్కడ ఎటువంటి పత్రాలు లేకుండా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి బిల్డింగులు కట్టుకున్న వారు ఎంతో మంది ఉన్నారని, అదేవిధంగా ఖాళీ స్థలాలను ఆక్రమించుకున్న వారు కూడా ఉన్నారని వారిని వదిలి నాపైనే వ్యక్తిగతంగా కక్షపూరితంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ తాసిల్దార్, మరియు మాజీ డీలర్ సుబ్బరాయుడు బారి నుండి నన్ను కాపాడి అక్కడ జరిగిన అవినీతిపై విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోనీ నాకు రక్షణ కల్పించాలని వాపోయాడు.

## గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గారిని పరామర్శించిన టీడీపీ నాయకులు కృష్ణ కిషోర్ రెడ్డి



**గిద్దలూరు సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామపంచాయతీ లింగాపురం గ్రామంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య చిన్న సర్జరీ చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యులు, ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య ని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు శస్త్ర చికిత్స జరిగిన తీరును ఆడిగితెలుసుకున్నారు . బాగా విశ్రాంతి తీసుకోవాలని కోరారు.

## నేడు కొమరోలు మండల వ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**





కొమరోలు మండలం లోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు ఈనెల 8వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నట్లుగా గిద్దలూరు విద్యుత్ శాఖ డీఈఈ బి వై శేషగిరిరావు, కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. గిద్దలూరు లోని 132 /33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ లో చేపట్టవలసిన అత్యవసరమైన సాంకేతిక మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొమరోలు మండలం లోని అన్ని సబ్‌స్టేషన్ పరిధిలో గల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తున్నదని వారు తెలిపారు. కావున రైతులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# పి జి ఆర్ ఎస్ కు 245 అర్జీలు

## – జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**



అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్.. జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైదియ దేవీ, డీఆర్వో వి.సుబ్బారావు, ఎస్డీసీ అచ్చుతాకుమారి, డీఆర్డీఏ పీడీ డి.రాంబాబు, డ్వామా పీడీ జీఎస్.రామ్ గోపాల్, సమగ్ర శిక్ష ఏపీడీ మమ్మి, డీఎల్డీవో విజయ్ భాస్కర్ తదితరులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులు స్వీకరించారు. భూ రికార్డు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, భూ ఆక్రమణలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పారిశుధ్యం, మురికి కాలువలకు పుడికతీత, ఇంటిస్థలం, గృహం, పింఛను, సదరం సర్టిఫికెట్, రోడ్లు మంజురు వంటి అంశాలపై మొత్తం – 245 అర్జీలు అందాయి. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమం ద్వారా వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై వెంటనే స్పందించి, క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.. పరిష్కరించిన అర్జీల నివేదికలను సక్రమంగా ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలి జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీల పరిష్కార పురోగతిని నేరుగా తెలుసుకోవచ్చుని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లీడర్షిప్ కాంక్లేవ్‌లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

మంగళగిరి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో సోమవారం జరిగిన టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్షిప్ కాంక్లేవ్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులుతో కలిసి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## కుష్టు రహిత జిల్లాయే లక్ష్యం

### – జిల్లా కలెక్టర్ రాజాబాబు



**ఒంగోలు కలెక్టరేట్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

ప్రకాశం జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు అన్నారు. సోమవారం లెప్రసికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలందరూ కుష్టి వ్యాధి పరీక్షలు నిర్వహించే సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య శాఖ అధికారి మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుండి 24వ తేదీ వరకు 14 రోజులు పాటు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు.. టీబీ.. ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ బాలాజీ, పీఎంఓ డాక్టర్ సూరిబాబు, ప్రోగ్రాం అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు – ఐద్వా నేతలు

## కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

**ఒంగోలు టౌన్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయని ధరల పెరుగుదల వలన సామాన్య ప్రజల జీవనం అగమ్యగోచరంగా మారిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద నిత్యవసర సరుకులను ప్రదర్శిస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఐద్వా జిల్లా నాయకురాలు యస్.కె. మల్లిక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ధరలు పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఐద్వా నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెల రోజులుగా అన్ని నిత్యవసర సరుకులు ధరలు దాదాపు 50శాతం పైగా పెరిగాయని అన్నారు. ఉపాధి లేక జీవనం ఎట్లా అని ప్రజలు ఆందోళన పడుతున్నారని, ఉన్న అరకొర ఉపాధితో ప్రజల యొక్క ఆదాయాలు పెరగడం లేదని ఫలితంగా పేద మధ్య తరగతి సామాన్య, ప్రజల యొక్క బ్రతుకులు తీవ్ర ఇబ్బందులకు నెట్టి వేయబడ్డాయని అన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల పనులు లేక కరువు జిల్లాగా ప్రకాశం జిల్లా ఉన్నదని, ఈ పరిస్థితుల్లో తక్షణమే నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రేషన్ డిపోల ద్వారా ప్రజలకు అవసరమైన 14 రకాల నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధరలు పెరుగుదలను అరికట్టక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జి ఆదిలక్ష్మి, జిల్లా కోశాధికారి బి.రాజలక్ష్మి, మాట్లాడారు. ధర్నా అనంతరం కలెక్టర్ రాజాబాబు కి ఐద్వా బృందం వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ డిమాండ్స్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారని ఐద్వా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు కె.రాజేశ్వరి,యం.పద్మ, యస్.విజయలక్ష్మి, ఏ.విశ్రాంత, ఎస్.కె మస్తాన్ బి,ఎస్.డి.అమీరున్నీస్సా, బి.రంగమ్మ, జి.నాగేశ్వరమ్మ, ఏ.అంజమ్మ, ధనలక్ష్మి ఎస్.కె పర్వీన్,మాధవి,కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## భానుచందర్‌ను పరామర్శించిన పలువురు నేతలు





**పొదిలి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

సీనియర్ ఎలక్ట్రానిక్ ఛానల్ రిపోర్టర్ పింగళి భానుచందర్ ను పలువురు పరామర్శించారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పొదిలిలోని తన నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా సోమవారం నాడు పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, రాష్ట్ర టి ఎన్ ఎస్ ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ తదితరులు భానుచందర్ ను నివాస గృహంలో కలుసుకొని అతని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భానుచందర్ త్వరగా కోలుకొని, తన వృత్తిని కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.


## పద్మశ్రీ భానుమతికి నివాళి

**ఒంగోలు కల్చరల్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

ఇటీవల ఒంగోలులో ఏర్పాటు చేసిన ప్రముఖ సినీ నటి, పద్మశ్రీ డాక్టర్ భానుమతి రామకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సోమవారం బ్రాహ్మణ మహిళలు ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ పద్మశ్రీ భానుమతి ప్రకాశం జిల్లా వాసి అవడం అందరు గర్వించదగ్గ విషయం అని అన్నారు. సినీ రంగంలో ఎదురులేని కళాకారునిగా తన ప్రతిభ చాటుకున్నటువంటి మహోన్నత వ్యక్తి భానుమతి రామకృష్ణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యురాలు కామరాజు గడ్డ కుసుమకుమారి, శివాలయం పాలకమండలి సభ్యురాలు సాక్షి సుజాత, కొణిజేటి మారుతి, వినయ్ కుమార్, వనజ, అనంతలక్ష్మి, ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.



# యువత భవిష్యత్ లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ – జిల్లా కలెక్టర్ పి రాజా బాబు



**ఒంగోలు టౌన్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

ఎలక్ట్రిక్ వాహనాలు, డ్రోన్ సాంకేతికతలలో ప్రతిభా కేంద్రం ఏర్పాటు ప్రకాశం జిల్లా యువతకు భవిష్యత్ సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందించే ఒక ముఖ్యమైన కార్యక్రమం అని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు పేర్కొన్నారు. అర్హత కలిగిన ఐటిఐ, డిప్లొమా, డ్రాప్‌అవుట్ యువత, మహిళలు నిరుద్యోగ యువత క్యూఆర్ కోర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలియజేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, ఏపీ ఎస్ఎస్డిసి, మైనింగ్ శాఖ, సెంటూరియన్ విశ్వవిద్యాలయం ప్రతినిధుల భాగస్వామ్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలోఎలక్ట్రిక్ వాహనాలు, డ్రోన్ సాంకేతికతల లో ప్రతిభా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఐటిఐ విద్యార్థులు, డిప్లొమా అభ్యర్థులు, డ్రాప్‌అవుట్ యువత, మహిళలు, నిరుద్యోగ యువతకు ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవి) డ్రోన్ టెక్నాలజీలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించబడుతుందని తెలిపారు. ఎలక్ట్రిక్ వెహికల్ అండ్ డ్రోన్ సిస్టమ్స్ ప్రాథమిక అంశాలు, అసెంబ్లీ మెయింటెనెన్స్ ప్రాక్టీసులు, డ్రోన్ ఆపరేషన్స్.. ఫీల్డ్ హ్యాండ్లింగ్,ట్రబుల్‌షూటింగ్ దయాగ్నస్టిక్స్, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ ట్రైనింగ్, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ప్లేస్‌మెంట్ సపోర్ట్ ఈ శిక్షణ లో ప్రధాన అంశ్యాలని పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, ప్రభుత్వ ఐటిఐ కళాశాల బాలుర ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. యువత నైపుణ్యాల శక్తి – ప్రకాశం జిల్లా ఉజ్వల భవిష్యత్తు అనే లక్ష్యంతో యువతను ఆధునిక సాంకేతిక నైపుణ్యాలతో తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలియజేశారు.

## నారాయణస్వామికి ఆదాయం రూ. 2,69,168/-లు

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 7**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం నకు ఆదివారం ఆదాయం రూ.2,60,168/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 1, 12,870/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.29,940/- లు, శాశ్వత అన్నదాన పథకం నకు రూ,50,214/- లు , స్వామివారికి శ్రీపాద కానుకలు రూ,45,928/- లు స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .5,516/- లు, మహా ప్రాకార నిర్మాణమునకు రూ.14,500/- లు, ఇతర విరాళముల వలన రూ. 1,200/- లు వచ్చినట్లు తెలిపారు.

### విశాఖ రాజకీయాల్లో ఆసక్తికర సమీకరణాలు

# విశాఖ మేయర్ పీఠంపై పట్టాభి గురి!




- అనుభవం.. అనుబంధాల బలం..
- ఏడేళ్ల సంస్థాగత పట్టు..
- ఉన్నత విద్యా నేపథ్యం..
- రాజకీయ చదరంగంలో వ్యూహాత్మక అడుగులు
- సీనియర్ నేతల సాన్నిహిత్యం..
- కూటమి ఎమ్మెల్యేలతో
- వ్యక్తిగత పరిచయాలు..
- కార్యకర్తలతో విస్తృత అనుబంధం..
- నగర రాజకీయాలపై పట్టు..
- కూటమి నిర్ణయమే కీలకం!

### విశాఖ మేయర్ పీఠం చుట్టూ అసక్టికర రాజకీయ సమీకరణాలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ప్రత్యేక ప్రతినిధి:**
విశాఖ మహానగర రాజకీయాల్లో మేయర్ పీఠంపై అప్పుడే ఆసక్తికర చర్చ మొదలైంది. ఎన్నికల నగారా మోగకముందే వివిధ రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తుండగా, తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ చోడే వెంకట పట్టాభిరామ్ పేరు కూడా రాజకీయ వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. మాజీ కార్పొరేటర్‌గా నగర పాలనపై అనుభవం, పార్టీ సంస్థాగత వ్యవహారాలపై పట్టు, ఏడు సంవత్సరాల పాటు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం, ఉన్నత విద్యా నేపథ్యం, సీనియర్ నాయకులతో సన్నిహిత సంబంధాలు, కూటమి ఎమ్మెల్యేలతో వ్యక్తిగత పరిచయాలు, పార్టీ కార్యకర్తలతో క్షేత్రస్థాయి అనుబంధం, వివిధ సామాజిక వర్గాల్లో ఉన్న పరిచయాలు కలిసి వస్తే పట్టాభి రాజకీయ అవకాశాలు మరింత బలోపేతం కావచ్చునే విశ్లేషణ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

## అనుభవం అనే ప్రధాన అస్త్రం

కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో పాటు నగర రాజకీయాలపై ప్రత్యక్ష అవగాహన పట్టాభికి ప్రధాన బలంగా కనిపిస్తోంది. కార్పొరేషన్ వ్యవహారాలు, వార్డు స్థాయి రాజకీయాలు, ప్రజా సమస్యలపై అవగాహన ఆయనకు ప్రత్యేకంగా కలిసి వచ్చే అంశమని టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేవిధంగా ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన అనుభవం కూడా స్థానిక సంస్థల రాజకీయాలపై ఆయనకున్న అవగాహనకు నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రజాప్రతినిధిగా, పార్టీ నాయకుడిగా వివిధ స్థాయిల్లో పనిచేసిన అనుభవం మేయర్ రేసులో ఆయనకు అదనపు బలంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## ఉన్నత విద్య.. ఇంజినీరింగ్ నేపథ్యం కూడా బలమే!

రాజకీయ అనుభవంతో పాటు పట్టాభికి ఉన్న ఉన్నత విద్యా నేపథ్యం కూడా ఆయనకు ప్రత్యేకంగా కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇంజినీరింగ్ పట్టభద్రుడిగా, ఎం.టెక్ ఉన్నత విద్యను పూర్తి చేసిన వ్యక్తిగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండటం ఆయన వ్యక్తిత్వానికి మరో కోణాన్ని జోడిస్తోంది. నేటి ఆధునిక నగర పాలనలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై అవగాహన కీలకంగా మారుతున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ విద్యా నేపథ్యం కూడా పట్టాభికి అదనపు బలంగా మారవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రాజకీయ అనుభవానికి ఉన్నత విద్య తోడైతే నగర అభివృద్ధి అంశాలపై మరింత సమగ్ర అవగాహనతో ముందుకు సాగే అవకాశం ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

## ఏడేళ్ల సంస్థాగత అనుభవం.. కార్యకర్తలతో సన్నిహిత బంధం

చోడే వెంకట పట్టాభిరామ్ రాజకీయ ప్రస్థానంలో పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఆయనకున్న అనుభవం మరో ప్రధాన బలంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సుమారు ఏడు సంవత్సరాల పాటు విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించడం ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయనకు విస్తృత పరిచయాలు ఏర్పడ్డాయి. జిల్లా స్థాయి బాధ్యతల్లో ఉన్న సమయంలో వివిధ నియోజకవర్గాల నాయకులు, వార్డు స్థాయి కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసిన అనుభవం ఆయనకు సంస్థాగతంగా ప్రత్యేక బలాన్ని ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం, నాయకత్వంలోని వివిధ స్థాయిలతో అనుబంధాలను కొనసాగించడం కూడా పట్టాభికి కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. పార్టీ కార్యకర్తల నుంచి సీనియర్ నాయకుల వరకు ప్రతి స్థాయిలో ఆయనకు ఉన్న పరిచయాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో కీలకంగా మారే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

## సీనియర్ నేతల సాన్నిహిత్యం.. రాజకీయ బలం?

ప్రస్తుత శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రాజకీయ పాఠశాలలో ఎదిగిన నాయకుడిగా పట్టాభికి గుర్తింపు ఉందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. సీనియర్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతోనూ సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉందని చెబుతున్నారు. విశాఖ నగర రాజకీయాల్లో వివిధ దశల్లో సీనియర్ నాయకులతో కలిసి పనిచేసిన అనుభవం పట్టాభికి రాజకీయంగా ఉపయోగపడవచ్చునే అభిప్రాయం ఉంది. పార్టీ అంతర్గత సమన్వయం, నాయకత్వంతో సంబంధాలు అభ్యర్థిత్వం వంటి కీలక సందర్భాల్లో ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.

## సీనియర్ నాయకులతో అనుబంధాల సమీకరణం

టీడీపీ సీనియర్ నాయకులు గంటా శ్రీనివాసరావు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు తదితరులతో ఉన్న రాజకీయ, వ్యక్తిగత అనుబంధాలు కూడా పట్టాభికి కలిసి వచ్చే అవకాశాలున్నాయని ఆయన సన్నిహితులు భావిస్తున్నారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులతో సంబంధాలు ఉండటం వల్ల నగరవ్యాప్తంగా పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకునే అవకాశం పెరుగుతుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. మేయర్ అభ్యర్థిత్వం విషయంలో పార్టీ అంతర్గత మద్దతు కీలకమైన నేపథ్యంలో ఈ అనుబంధాలు ప్రాధాన్యం సంతరించుకునే అవకాశముంది. అయితే రాజకీయాల్లో వ్యక్తిగత సాన్నిహిత్యం కంటే పార్టీ నిర్ణయం, కూటమి సమీకరణాలకే అంతిమ ప్రాధాన్యం ఉంటుందనే విషయాన్ని రాజకీయ పరిశీలకులు గుర్తుచేస్తున్నారు.

## కూటమి ఎమ్మెల్యేలతో వ్యక్తిగత పరిచయాలు.. సౌమ్యుడిగా ప్రత్యేక గుర్తింపు

విశాఖ రాజకీయాల్లో కూటమి సమీకరణాలు కీలకంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పార్టీలకు చెందిన కూటమి ఎమ్మెల్యేలతో పట్టాభికి ఉన్న వ్యక్తిగత పరిచయాలు కూడా ఆయనకు రాజకీయంగా కలిసి వచ్చే అంశంగా చర్చ జరుగుతోంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే సి.హెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు), గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులతో పట్టాభికి ఉన్న పరిచయాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులతో సమన్వయంగా వ్యవహరించే స్వభావం పట్టాభికి మరో ప్రత్యేకతగా చెబుతున్నారు. రాజకీయంగా విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా అందరితో సత్సంబంధాలు కొనసాగించడంలో ఆయనకు మంచి గుర్తింపు ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా పార్టీ కార్యకర్తల నుంచి సీనియర్ నాయకుల వరకు అందరితో కలుపుగోలుగా వ్యవహరించే వ్యక్తిగా, సౌమ్య స్వభావం కలిగిన నాయకుడిగా పట్టాభికి రాజకీయ, సామాజిక వర్గాల్లో గుర్తింపు ఉందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కూటమి రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, పరస్పర సమన్వయం కూడా కీలక పాత్ర పోషించే నేపథ్యంలో ఈ సౌమ్య స్వభావం, అందరితో సన్నిహితంగా మెలిగే తీరు ఆయనకు అదనపు బలంగా మారవచ్చునే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఎంపీ భరత్ కుటుంబంతో ప్రత్యేక అనుబంధం

విశాఖ రాజకీయ, సామాజిక వర్గాల్లో పట్టాభికి ఉన్న విస్తృత పరిచయాల్లో మరో ముఖ్యమైన అంశంగా విశాఖ ఎంపీ భరత్ కుటుంబంతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. ముఖ్యంగా భరత్ తాతగారు, ప్రముఖ నాయకుడు ఎంవీవీఎస్ మూర్తితో పట్టాభికి ఉన్న ప్రత్యేక అనుబంధం ఆ కుటుంబంతో ఏర్పడిన సాన్నిహిత్యానికి నిదర్శనంగా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. నగర రాజకీయాల్లో విభిన్న వర్గాలతో ఉన్న వ్యక్తిగత, రాజకీయ సంబంధాలు భవిష్యత్ సమీకరణాల్లో ఉపయోగపడే అవకాశం ఉందనే విశ్లేషణ వినిపిస్తోంది. విశాఖ నగర అభివృద్ధి, వ్యాపార, సామాజిక రంగాలతో సంబంధాలు కలిగి ఉండటం కూడా పట్టాభికి అదనపు బలంగా మారవచ్చని భావిస్తున్నారు.

## సామాజిక సమీకరణాల్లో పట్టాభి పాత్ర

విశాఖ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు ఎప్పుడూ కీలకమే. ఈ నేపథ్యంలో వివిధ సామాజిక వర్గాలతో పట్టాభికి ఉన్న పరిచయాలు, అనుబంధాలు రాజకీయంగా కలిసి వచ్చే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. విశాఖ నగరంలో వ్యాపార రంగంలోనూ సుపరిచితుడిగా ఉండటం, వివిధ వర్గాల ప్రజలతో సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు అదనపు బలంగా మారవచ్చని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే మేయర్ ఎన్నికల్లో ఒక్క సామాజిక వర్గం మద్దతు మాత్రమే కాకుండా అన్ని వర్గాల సమన్వయం కీలకమనే అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

## పట్టాభికి ప్రధాన ప్లస్‌లు ఇవే...

- మాజీ కార్పొరేటర్‌గా నగర పాలనపై ప్రత్యక్ష అనుభవం
- ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన రాజకీయ అనుభవం
- విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా సంస్థాగత పట్టు
- ఏడు సంవత్సరాల పాటు విశాఖ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవం
- పార్టీ కార్యకర్తలు, నాయకులతో క్షేత్రస్థాయి నుంచి సుదీర్ఘ సాన్నిహిత్యం
- వివిధ నియోజకవర్గాల పార్టీ శ్రేణులతో విస్తృత పరిచయాలు
- కూటమిలోని ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులతో వ్యక్తిగత పరిచయాలు
- అందరితో కలుపుగోలుగా వ్యవహరించే సౌమ్య స్వభావం
- సీనియర్ నాయకులతో రాజకీయ అనుబంధాలు
- విశాఖ ఎంపీ భరత్ కుటుంబంతో, ముఖ్యంగా ఆయన
- తాత ఎంవీవీఎస్ మూర్తితో ఉన్న ప్రత్యేక అనుబంధం
- ఇంజినీరింగ్ పట్టభద్రుడిగా, ఎం.టెక్ పూర్తి చేసిన ఉన్నత విద్యా నేపథ్యం
- ఆధునిక నగరాభివృద్ధి, సాంకేతిక అంశాలపై అవగాహన
- వివిధ సామాజిక వర్గాల్లో పరిచయాలు
- వ్యాపార, రాజకీయ రంగాల్లో విస్తృత సంబంధాలు
- నగర రాజకీయాలు, స్థానిక సంస్థల వ్యవహారాలపై అవగాహన

## అయితే సవాళ్లు కూడా లేకపోలేదు!

మేయర్ పీఠం కోసం పోటీ పడే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పార్టీ అంతర్గత పోటీ, కూటమి భాగస్వామ్య పక్షాల సమీకరణాలు, సామాజిక సమతుల్యత, రిజర్వేషన్ అంశం, అధిష్ఠానం నిర్ణయం వంటి అనేక అంశాలు అభ్యర్థిత్వాన్ని ప్రభావితం చేయనున్నాయి. వ్యక్తిగత రాజకీయ బలం ఎంత ఉన్నప్పటికీ పార్టీ అధిష్ఠానం నిర్ణయం, ఎన్నికల సమయానికి ఏర్పడే రాజకీయ పరిస్థితులు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య జరిగే చర్చలు, స్థానిక రాజకీయ సమీకరణాలు కూడా మేయర్ అభ్యర్థి ఎంపికలో ప్రభావం చూపే అవకాశముంది.

## అనుభవం.. అనుబంధాల బలం.. ఉన్నత విద్య... ఇప్పుడు మేయర్ గురి?

విశాఖ రాజకీయాల్లో చోడే వెంకట పట్టాభిరామ్ పేరు మేయర్ రేసులో వినిపించడానికి ఆయనకున్న రాజకీయ అనుభవం, నగర పాలనపై అవగాహన, సంస్థాగత పదవి, ఏడేళ్ల జిల్లా స్థాయి అనుభవం, ఉన్నత విద్యా నేపథ్యం, పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు, కూటమి ఎమ్మెల్యేలతో వ్యక్తిగత పరిచయాలు, సీనియర్ నాయకులతో అనుబంధాలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అయితే చివరికి టీడీపీ అధిష్ఠానం ఎవరిపై మొగ్గు చూపుతుంది? కూటమి సమీకరణాలు ఎలా మారతాయి? స్థానిక రాజకీయ పరిస్థితులు ఎవరికి అనుకూలిస్తాయి? సామాజిక సమతుల్యతలో పట్టాభికి ఎంత ప్రాధాన్యం దక్కుతుంది? అన్న ప్రశ్నలే తుది నిర్ణయాన్ని నిర్దేశించనున్నాయి. ఎన్నికల నగారా ఇంకా మోగలేదు... కానీ విశాఖ మేయర్ పీఠం చుట్టూ రాజకీయ చదరంగం మాత్రం ఆసక్తికరంగా మారుతోంది. అనుభవాన్ని అస్త్రంగా, ఏడేళ్ల సంస్థాగత బలాన్ని పునాదిగా, ఉన్నత విద్యను అదనపు శక్తిగా, కూటమి నాయకులతో అనుబంధాలను రాజకీయ బలంగా మార్చుకుని చోడే వెంకట పట్టాభిరామ్ మేయర్ రేసులో తనదైన ముద్ర వేస్తారా? అన్నది రాబోయే రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి.

> **"అనుభవాన్ని అస్త్రంగా... ఏడేళ్ల సంస్థాగత బలాన్ని పునాదిగా... ఉన్నత విద్యను అదనపు శక్తిగా... మార్చుకుని పట్టాభి మేయర్ వేసిలో తనదైన ముద్ర వేస్తారా?"**
> **అన్నది రాబోయే రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి..!**



# యశ్ ఈసారి వెళ్లేది ఏ పరిశ్రమకి!

-కేజీఎఫ్- ఫ్రాంచైజ్‌తో కన్నడ చిత్ర పరిశ్రమ సరిహద్దులు దాటి పాన్-ఇండియా స్థాయిలో తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్నారు రాకింగ్ స్టార్ యశ్. ఒక్క సినిమాతో గ్లోబల్ గుర్తింపు తెచ్చుకున్న యశ్ ప్రతీ ప్రాజెక్ట్‌ను వ్యూహాత్మకంగా ఎంచుకుంటున్నారు. కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో చేసిన -కేజీఎఫ్- ప్రభంజనం అనంతరం .. మలయాళ పరిశ్రమకు చెందిన ప్రతిభావంతమైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి -టాక్సిక్- చిత్రాన్ని పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. ఇటీవలే భారీ అంచనాల మధ్య విడుదలైందీ చిత్రం. ఇలా విభిన్న పరిశ్రమల ట్యాలెంట్ తో ముందుకు సాగుతున్న యశ్ తదుపరి చిత్రం కోసం ఏ పరిశ్రమ వైపు అడుగులు వేస్తారనేది ఆసక్తికరం.







యశ్ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఆయన కేవలం ఒకే పరిశ్రమకు ఫార్ములాకు కట్టుబడి ఉండటం లేదని స్పష్టమవుతోంది. కన్నడ డైరెక్టర్‌తో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన యశ్ ఆ తర్వాత కేరళకు చెందిన ఆఫ్-బీట్ .. కంటెంట్-డ్రివెన్ ఫిల్మ్ మేకర్ గీతూ మోహన్‌దాస్‌ను ఎంచుకుని ఆశ్చర్యపరిచారు. ఈ ప్రయోగం ఆయన మేకింగ్‌లో .. కథల ఎంపికలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. విభిన్న చిత్ర పరిశ్రమలలోని ప్రతిభను ఉపయోగిస్తూ గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకోవడమే లక్ష్యంగా యశ్ ప్రణాళికలు సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే యశ్ తదుపరి చిత్రం ఏ ఇండస్ట్రీకి చెందిన దర్శకుడితో ఉండబోతోందనే దానిపై చర్చ నడుస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్ ..టాలీవుడ్ పరిశ్రమలకు చెందిన పలువురు అగ్ర దర్శకులు ఆయనతో సినిమాలు చేసేందుకు క్యూలో ఉన్నారని తెలిసింది. తమిళ పరిశ్రమలోని భారీ యాక్షన్ యూనివర్స్ సృష్టించే విజనరీ దర్శకులు, టాలీవుడ్‌లోని లార్జర్ ద్యాన్ లైఫ్ కాన్సెప్ట్‌లను తెరకెక్కించే స్టార్ డైరెక్టర్లు యశ్ కోసం పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌లను సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ముఖ్యంగా టాలీవుడ్ మాస్ .. హై-వోల్టేజ్ డ్రామాలకు పెట్టింది పేరు . కోలీవుడ్ గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే .. స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. యశ్ కున్న మాస్ ఇమేజ్‌కు టాలీవుడ్ దర్శకుడి విజన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కోలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ మేకర్స్‌తో జతకడితే యశ్ మార్కెట్ మరింత విస్తరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండింటిలో యశ్ ఎవరికి ఓటు వేస్తారనేది ఆసక్తికరం. చివరిగతా ఉత్తరాది, దక్షిణాది సరిహద్దులను చెరిపేస్తూ ప్రతీ భాషలోని అత్యుత్తమ సాంకేతిక నిపుణులను, దర్శకులను ఒకే వేదికపైకి తెచ్చేలా యశ్ వ్యూహం కనిపిస్తోంది. అందుకే యశ్ తదుపరి ఎంపిక కూడా ప్రతిష్టాత్మకంగా ఊహించని కాంబినేషన్‌లో ఉండే అవకాశం ఉందనే ప్రచారం బలపడుతోంది. దీనిపై పూర్తి క్లారిటీ రావాలంటే మరింత సమయం పడుతుంది. ప్రస్తుతం యశ్ బాలీవుడ్ లో తెరకెక్కుతోన్న -రామాయణం-లో రావణుడి పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న చిత్రం మొదటి భాగం దీపావళి కానుకగా రిలీజ్ అవుతుంది.

## పాక్ కెప్టెన్‌కు ఐసీసీ ఫైన్.. షఫాలీని ఔట్ చేసి సైగలు చేయడంతో చర్యలు

- షఫాలీ వర్మను ఔట్ చేశాక అతిగా సంబరాలు చేసుకున్న పాక్ కెప్టెన్
- ఫాతిమా సనా ప్రవర్తనపై చర్యలు తీసుకున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి
- మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ కేటాయింపు
- 24 నెలల వ్యవధిలో ఫాతిమాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్
- ఈ మ్యాచ్‌లో పాక్‌ను చిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు




ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా ఐసీసీ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించింది. టీమిండియా బ్యాటర్ షఫాలీ వర్మ వికెట్ తీసిన అనంతరం అనుచితంగా ప్రవర్తించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు, ఆమె ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్ షఫాలీ వర్మ (12) ఫాతిమా సనా బౌలింగ్‌లోనే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. వికెట్ తీసిన మహిళల ఉత్సాహంలో ఫాతిమా, షఫాలీని ఉద్దేశించి పెవిలియన్ వైపు వెళ్లాలంటూ వేలితో సైగ చేస్తూ అనుచితంగా ప్రవర్తించింది. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధనలను ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.గత 24 నెలల కాలంలో ఫాతిమా సనాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అంపైర్ ఔట్ ఇచ్చినప్పటికీ క్రీజు వదిలి వెళ్లేందుకు నిరాకరించినందుకు ఆమె ఖాతాలో తొలి డీమెరిట్ పాయింట్ చేరింది.

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర.. డబుల్ సెంచరీతో అరుదైన జాబితాలోకి!

**ఫైనల్లో 200 చేసిన ఐదో బ్యాటర్**

**ఫస్ట్‌క్లాస్‌లో 4,000 పరుగులు పూర్తి**

**ఇదే ఫార్మాట్‌లో ఇషాన్‌కు 10వ సెంచరీ**

**కుశాగ్ర కూడా ఫైనల్లో సెంచరీ**

**ప్రస్తుతం ఆధిపత్యంలో ఈస్ట్ జోన్**



దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు.ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు.ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛతేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు.మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

## స్పిన్ వ్యూహమే మా బలం.. స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకొని బౌలింగ్ చేశా: శ్రీ చరణి



వుమెన్స్ టీ20 ఆసియా కప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో (3 వికెట్లు, 7 పరుగులు) చెలరేగిన యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ జట్టు వ్యూహాలను పంచుకున్నారు.మ్యాచ్‌కు ముందే తమ స్పిన్ బౌలర్లు అందరూ (ప్రేమ, తాను, దీప్తి, రాధా యాదవ్ ) కలిసి కూర్చుని వ్యూహరచన చేస్తామని చరణి తెలిపారు. సీనియర్లు చెప్పిన విషయాలను మైదానంలో సమర్థవంతంగా అమలు చేయడంపైనే తాము దృష్టి పెడతామని ఆమె స్పష్టం చేశారు.పిచ్‌ను పరిశీలించిన తర్వాత బంతికి మంచి టర్న్ లభిస్తుందని గ్రహించి, కేవలం స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టానని చెప్పారు. విషయాలను ఎక్కువగా ఆలోచించకుండా సింపుల్‌గా ఉంచుకోవడం, బేసిక్స్‌పైనే ఫోకస్ పెట్టడమే తన సక్సెస్‌కు సీక్రెట్ అని చరణి పేర్కొన్నారు.ఇక అద్భుతంగా రాణించిన తోటి బౌలర్ ప్రేమ రావత్‌ను ప్రశంసిస్తూ.. ఆమె ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ చేయగల సహజ ప్రతిభావంతురాలైన క్రికెటర్ అని కొనియాడారు. బౌలర్లకు సహకరించే ఈ వికెట్‌పై సుమారు 120 పరుగులు సరైన స్కోరేనని అభిప్రాయపడిన ఆమె, ఇకపై టోర్నమెంట్‌లో తాము ఒక్కో మ్యాచ్‌పైనే పూర్తి దృష్టి పెడతామని తేల్చిచెప్పారు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776